విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

బుధవారం 14 ఫిబ్రవరి 2024 8 పేజీలు

టీడీపీ నుంచి బరిలోకి..

ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా మాగుంట రాఘవరెడ్డి ?

- వైసీపీ నుంచి త్వరలోనే టీడీపీలో చేరే అవకాశం
- వైసీపీలో 'మాగుంట'కు తీవ్ర అవమానం
- దీంతో పార్టీ వీడుతున్నట్లు ప్రచారం
- ఈసారి రాఘవరెడ్డిని బరిలో దించే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి ఆ పార్టీ వీడనున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మాగుంట రాఘవరెడ్డి బరిలో దిగనున్నట్లు సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో రాజకీయ ముఖచిత్రం మారుతుంది. నిన్న మొన్నటి వరకు వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి మరోసారి మాగుంట కుటుంబం టిక్కెట్టు ఆశించినప్పటికీ ఈసారి మాగుంటకు టిక్కెట్టు ఇచ్చేది లేదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా నేతలకు స్పష్టం చేశారు. మరోసారి పునరాలోచించాలని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పలుసార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా నిరాకరించారు. చివరగా సోమవారం బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. అక్కడే ఉన్న చిత్తూరు జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దగ్గరకు పిలిచి ఈయనే ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నారు. మీరిద్దరు కలిసిమెలిసి పనిచేయాలి. జిల్లాను ముందుండి నడిపించాలి. ఇక మాగుంట ప్రస్తావన తీసుకురామాకు అని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. దీంతో మాగుంట వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. వచ్చే ఎన్నికల్లో మాగుంట కుమారుడు రాఘవరెడ్డిని తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలో దించేందుకు మాగుంట సిద్ధమయ్యారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీతో మాగుంట సంప్రదింపులు జరుపుతున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసరెడ్డి తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసరెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో వైసీపీ నుంచి వైవి సుబ్బారెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత టీడీపీ మాగుంటకు ఎంఎల్‌సీ చేసి గౌరవించింది. అయినా కొన్ని రోజుల తరువాత మాగుంట శ్రీనివాసరెడ్డి తెలుగుదేశం పార్టీని వీడి వైసీపీలో చేరారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాగుంట ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మాగుంట విజయం సాధించారు. మొదటిలో జగన్మోహన్‌రెడ్డితో సన్నిహితం ఉన్నప్పటికి కొన్ని వ్యాపార లావాదేవీల కారణంగా రోజురోజుకు వైసీపీకి దూరమయ్యారు. ప్రస్తుతం మాగుంట సీఎంను కలిసే ప్రయత్నం చేసినప్పటికీ అపాయింట్‌మెంట్ దక్కని స్థాయికి చేరింది. అంతేకాకుండా ఎంపీ అభ్యర్థిగా వైసీపీ నుంచి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు ఖరారు చేశారు. దీంతో మాగుంట వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మాగుంట ముఖ్య అనుచరులతో ప్రత్యేక బేటీ అయ్యారు. మాగుంట కుటుంబ మిగతా 2 లో ...

రూ.110 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారం

దర్శి వైసీపీ ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

విశాలాంధ్ర-దర్శి : దర్శి నగర పంచాయితీ త్రాగునీటి సమస్యకు 110 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని దర్శి వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నగర పంచాయితీ పరిధిలోని 12వ వార్డులో జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా వైసీపీ నాయకులు, కార్యకర్తలు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురికి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 2004 నుంచి దర్శి నియోజకవర్గ ప్రజలతో అవినాభావ సంబంధం ఉందని, దర్శి నియోజకవర్గ అభివృద్ధిలో స్వర్గీయ బూచేపల్లి సుబ్బారెడ్డి అభివృద్ధి చేశారని, ఆయన అడుగు జాడల్లో పయనిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మా కుటుంబంపై మిగతా 2 లో ...

అరాచక పాలన అంతం కోసమే

రా కదలిరా

- 17న ఇంకొల్లులో అధినేత చంద్రబాబు భారీ సభ
- లక్ష మందే లక్ష్యంగా...సభా ఏర్పాట్లు
- పార్లమెంట్ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - యద్దనపూడి : అరాచక పాలనను సాగనంపేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు రా కదలిరా సభతో శంఖారావం పూరించనున్నట్లు తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఈనెల 17న బాపట్ల పార్లమెంట్ పరిధిలో రా కదలిరా బహిరంగ సభ ఇంకొల్లులో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తో కలిసి బహిరంగ సభ స్థలాన్ని ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి దౌర్జన్యాలు అరాచకాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎండ కట్టేందుకు ప్రజలను చైతన్యం చేసేందుకు అవిశ్రాంతంగా పోరాడుతున్నా రన్నారు. వైసిపి దౌర్జన్యాలు ధమనకాండను మిగతా 2 లో ...

16న భారత్ బంద్ జయప్రదం చేయండి

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

విశాలాంధ్ర-ఒంగోలు : కిసాన్ మోర్చా, భారత్ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు పాల్గొని మాట్లాడారు. సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యలమీద 13 నెలలపాటు జరిగిన సుదీర్ఘ పోరాటం తరువాత మూడు నల్లచట్టాలను రద్దుచేస్తున్నట్లు ప్రకటించిన బిజెపి ప్రభుత్వం రెండేళ్లు గడిచినా రైతులకు ఇచ్చిన హామీలు ఏమి అమలు చేయలేదన్నారు. నాలుగు లేబర్ కోట్లు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. గ్రామీణ బంద్ కార్మిక సమ్మెతో కేంద్రానికి బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో వామపక్ష శ్రేణులు బంద్, సమ్మె కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. గ్రామాల్లో ఉండే రైతులు, కార్మికులు పెద్ద -సంఖ్యలో సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ఐదువందల రైతు సంఘాలు, కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఈ బంద్‌లో మిగతా 2 లో ...

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ఏఐటీయూసీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మె జయప్రదం చేయాలని ఏఐటియుసి బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శృంగారపురం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ, బికేఎంయు,సిపిఐ పార్టీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. శామ్యూల్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తుందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు గనులు విద్యుత్, అటవీ సంపదలను, రవాణా,బ్యాంకులు, ఎల్ఐసీ తదితర సంస్థలన్నీటిని అదానీ, అంబానీ పలు కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా అప్ప జెప్పిందన్నారు. కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్‌లు తెచ్చిందన్నారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్ట లను రద్దు చేసిన మరొక రూపంలో వాటిని అమలుపరుస్తుందన్నారు. అదేవిధంగా విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ముందు పెట్టిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం మిగతా 2 లో ...

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొంటున్నాయని తెలిపారు. బంద్‌కు వామపక్షపార్టీల తరుపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలోనూ, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలోనూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రైతుల సుదీర్ఘ ఆందోళనలతో నల్లచట్టాలను ఉపసంహరించుకున్న కేంద్రం వాటిని సంపూర్ణంగా రద్దుచేసిన దాఖలాలు లేవన్నారు. 100లాది మంది రైతులమీద పెట్టిన కేసులు ఎత్తివేయలేదన్నారు. బడ్జెట్లో వీటిమీద చర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియామీద రూ.62వేల కోట్ల సబ్సిడీలు ఎత్తివేశారని వివరించారు. ఉపాధి హామీకి రూ.4052 కోట్ల కోత విధించారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 50లక్షల పరిశ్రమలను ప్రయివేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను బలోపేతం చేస్తూ దేశ సంపదను అంబాని, అదానీలకు దోచి పెడుతుందన్నారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వ హయాంలో 1.52 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. స్వామినాధన్ కమిటీ సిఫార్సులు ఏమి అమలు చేయలేదని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి, పారిశ్రామిక రంగాన్ని ప్రయివేటుపరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. ఈ చర్యలకు నిరసనగా ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగాజరిగే బంద్‌లో వామపక్ష శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలపాలని, బంద్, సమ్మెల్లో జిల్లాలో ఉన్న రైతులు, కార్మికులు పాల్గొని జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐఎంఎల్ (న్యూడెమొక్రసీ) రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెమీద నిర్బంధాన్ని ప్రయోగించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశ్వయత్నాలు చేస్తుందన్నారు. ఢిల్లీ చుట్టూ కంచెలు వేయడం, బారికేడ్లు పెట్టడం ఆపార్టీ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. సిపిఐఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ శక్తుల లాభాల కోసమే బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ కంకణాల ఆంజ నేయులు, సిపిఐ నాయకులు సివిఆర్ చౌదరి, ఆర్ వెంకట్రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు సిపిఐఎంఎల్ నాయకులు ఎంఎస్ సాయి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సామాన్య ప్రజల నిత్యవసర వస్తువులన్నింటిపైన జీఎస్టీ పెంచిందన్నారు. గత 10 ఏళ్లు బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల అదాని అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగా పేద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు 1.50 లక్షల మంది బలవన్మరణం పాలయ్యారన్నారు. బీజేపీ ప్రభుత్వం మన రాష్ట్రానికి మరింత ద్రోహం చేసిందని ప్రత్యేక హోదాను నిరాకరించిందన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇవ్వాల్సిన ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం లేదన్నారు.జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్వాసితుల నష్టపరిహారం,పురావాసం తనకు సంబంధం లేదని చెప్పటం దురదృష్టకరం అన్నారు. మరోవైపు రైల్వే జోన్ ఎగనామం పెట్టి రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రాల హక్కులను పూర్తిగా నిరంకుశత్వ దోరణితో హరించివేస్తుందన్నారు. దేశంలో విచ్చలవిడిగా మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక,ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు,కార్మిక ప్రజా అనుకూల విధానాలకై పోరాడాలని, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక,సంయుక్త కిసాన్ మోర్చాలు పిలుపునిచ్చాయన్నారు. పరిశ్రమల అన్నింటిలో కార్మిక సమ్మె జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, వినియోగదారుల సంఘాలు, వృత్తి సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా, సాంస్కృతిక సంఘాలు గ్రామీణ బందు పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లి భాగ్య శ్రీధర్, సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ బాపట్ల పాయింట్ మేస్త్రి తాత ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పులి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పెద్దలు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

విశాలాంధ్ర - చీరాల : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికలకు ముందు దేశ ప్రజలకు చెప్పిందొకటి చేస్తుందొకటని బీజేపీ పెద్దలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు.మంగళవారం చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక,సంయుక్త కిసాన్ మోర్చాలు ఫిబ్రవరి 16న ఇచ్చిన దేశ వ్యాప్త కార్మిక సమ్మె,గ్రామీణ బంద్‌ను జయప్రదం చెయ్యాలని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శామ్యూల్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతుల రుణమాఫీ చెయ్యాలన్నారు.కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం దేశం మొత్తం అమలయ్యేలా చట్టం చెయ్యాలని,నాలుగు లేబర్ కోడ్లు రద్దు చెయ్యాలన్నారు. దేశంలోని అసంఘటిత కార్మికులకు,స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని,ఆహార భద్రతా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిలుపుదల చెయ్యాలని, రైతులప్రయోజనాలకనుగుణంగా సమగ్ర పంటల భీమాను ఏర్పాటు చెయ్యాలన్నారు.అధికారంలోకి వచ్చేందుకు బిజెపి పెద్దలు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని రూపొందిస్తామన్నారు. ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చెయ్యాలన్నారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శిబాసి పైడయ్య,చీరాల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిరుమల ప్రకాష్ బాబు,ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబురావు,డిహెచ్ పిఎస్ చీరాల కన్వీనర్ దుడ్డు జోసెఫ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన అంతం కోసమే..రా కదలిరా

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొంటూ జిల్లాలో తెలుగుదేశం పార్టీ మహాశక్తిగా ఆవిర్భవించిందన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షం పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ప్రజలకు జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాన్ని వివరించి ప్రజలను చైతన్యం చేసేందుకు రా కదలిరా పేరుతో అధినేత చంద్రబాబు తారకరామా విజయభేరి ప్రాంగణంలో ఈ నెల 17న సభ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సభకు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి లక్షకుపైగా ప్రజల హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ విస్మరించి, ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సభతో వైసిపి ప్రభుత్వ పతనానికి నాంది పలకాలన్నారు.

- భారీ ఏర్పాట్లు...

తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ పరిధిలోని పార్లమెంట్ రథసారథి ఎమ్మెల్యే ఏలూరి సాంబ్యంలో జరుగుతున్న ఈ భారీ బహిరంగ సభకు లక్ష మంది లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకొల్లు లోని పావులూరి రోడ్డులో టిటిడి కళ్యాణ మండపం సమీపంలో 25 ఎకరాలలో ఈ సభ నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం 9:30 గంటలకు సభా ప్రాంగణం సమీపంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహిం చేందుకు ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, కోసం భూమిని చదును చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు నియోజకవర్గ నాయకులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.రా కదలిరా బహిరంగ సభ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు కమిటీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న అభిమానంతో మా తల్లి వెంకాయమ్మను జిల్లా పరిషత్ చైర్మన్‌గా నియమించారని, జిల్లా పరిషత్ నిధులతో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మరోమారు మీ ముందుకు వచ్చానని, మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. అదే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని తిరిగి మనమందరం ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2019 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. నియోజకవర్గ అభివృద్దే ప్రత్యేక ధ్యేయంగా పనిచేస్తానని, ప్రతి ఒక్కరిని తన కుటుంబ సభ్యునిగా భావించి వారికి పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ ఏఎంసీ చైర్మన్ కెవి రెడ్డి, వెన్నపూస వెంకటరెడ్డి, సద్ది పుల్లారెడ్డి, వేమిరెడ్డి చెన్నారెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి బరిలోకి..

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు, వారి అనుచరులు వైసీపీని వీడాలని సూచించారు. అందరి అభిప్రాయాల మేరకు వైసీపీ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. అధికారికంగా వైసీపీ ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన మరుక్షణమే మాగుంట వైసీపీ నుంచి బయటకొస్తారు. ఈలోగా తెలుగు దేశం పార్టీలో చేరేందుకు సర్వం సిద్దం చేసుకుంటున్నారు. ఈసారి ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసరెడ్డి కుమారుడు రాఘవరెడ్డిని రంగంలోకి దించనున్నారు.

అశోక్ బాబు..స్థాయి మరచి మాట్లాడొద్దు..

విశాలాంధ్ర - వేమూరు : నియోజకవర్గానికి కొత్తగా ఎక్కడి నుంచో వచ్చి వైసిపి ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టిన వరికూటి అశోక్ బాబు తన స్థాయి మరిచి మాజీమంత్రి నక్కా ఆనందబాబుపై విమర్శలు చేయడం సహేతుకం కాదని వేమూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మార్కెట్ యార్డ్ మాజీచైర్మన్ జొన్నలగడ్డ విజయ బాబు, వేమూరు మండల పార్టీ అధ్యక్షుడు దండే సుబ్బారావు, రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి కిషోర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అశోక్ బాబును ఎక్కడి నుంచో దిగుమతి చేసుకుంటే వచ్చిన మనిషి అన్నారు. గతంలో నువ్వు చేసిన ఉద్యోగం, రియల్ ఎస్టేట్ ద్వారా రైతులను ముంచిన విషయాలు ప్రజలకు తెలియనివి కాదన్నారు. అటువంటి నువ్వు అధికారులను అడ్డం పెట్టుకుని నియోజకవర్గంలో ఇల్లు అద్దెకి తీసుకుని ఆధార్ కార్డు పుట్టించుకున్నంత మాత్రాన నీవు స్థానికుడు కావని ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఎక్కడి నుంచి వచ్చావ్ అక్కడికి తిప్పి పంపడం ఖాయమని హెచ్చరించారు. మీ పార్టీ నీకు అవకాశం వచ్చింది పోటీ చేసి ప్రజల అభిమానం సంపాదించాలి కానీ ఏదో మాట్లాడి ప్రజలకు దగ్గరౌదామనుకోవడం ప్రేలాపనలేనని హెచ్చరించారు. ఇక్కడ మీ పార్టీ ఎమ్మెల్యేకు మీకు పడటం లేదని వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయి నిన్ను వైసీపీలోనే ఒక వర్గం వ్యతిరేకిస్తున్నారని ప్రజలకు తెలుసు అన్నారు. అవి కప్పిపుచ్చుకోవటానికి ఆనంద్ బాబుపై ఆరోపణ చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని గ్రహించుకోవాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు షేక్ హనీఫ్,వేల్పుల రవి, దోప్పలపూడి సుధాకర్, పోలు ప్రసాద్, కూచిపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలుకి ట్రై సైకిల్ పంపిణీ

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని కొడిగుంపల గ్రామానికి చెందిన పరుచూరి సుధారాణికి ట్రై సైకిల్‌ను మంగళవారం సాయంత్రం మానవతా సంస్థ ఆధ్వర్యంలో దాత సయ్యద్ అమీర్ బాబు అందజేశారు. మానవత సంస్థ అధ్యక్షులు పోలక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ అడిగిన వెంటనే స్పందించి ట్రై సైకిలను సమకూర్చిన సయ్యద్ అమీర్ బాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో మానవత కన్వీనర్ వెండి దండి వెంకటేశ్వరరెడ్డి, పి.మాల్యాద్రి, ఆకుల మాల్యాద్రి, పీ.మాల్యా చలం, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగు నీటి సమస్యలు పరిష్కరించండి

- సీపీఐ మండల కార్యదర్శి విశ్వరూపాచారి,పూర్తికట్టి తిరుమలయ్య

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని పలు గ్రామాలలో తాగునీరు లేక ఇబ్బందులు గురవుతున్నారని, ప్రజలకు, పశువులకు స్పందించి తాగునీటి కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి విశ్వరూపాచారి, సీపీఐ నాయకుడు పూర్తకట్టి తిరుమలయ్య వినతి పత్రాలు అందజేశారు. పశ్చిమ ప్రాంతంలో దోర్నాల మండలం అన్ని రంగాల్లో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, ప్రజలకు పశువులకు తాగేందుకు నీళ్లు లేవని, మంచిది ఎక్కువగా ఏర్పడిందని గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలలో ప్రభుత్వ స్పందించి మంచి నీటి సమస్యలు పరిష్కరించాలని, భారత కమ్యూనిస్టు పార్టీ ఎంపీడీవో నాసారెడ్డికి తన విన్నపాన్ని తెలియజేశారు. అందుకు స్పందించిన ఎంపీడీవో నీటికి ఇబ్బంది లేకుండా చూస్తారని తెలియజేశారు.

సీఎం సహాయక నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం సీఎం సహాయక నిధి చెక్కులు పంపిణీ చేశారు .కనిగిరి చెందిన కృష్ణమాచారి, మూలే కోటయ్య,సగిటి ఈశ్వరమ్మకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వై యం ప్రసాద్ రెడ్డి, విజిలెన్స్ కమిటీ సభ్యులు కనిగిరి జెడ్పిటిసి కస్తూరి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, మండాది కృష్ణారెడ్డి, దామిరెడ్డి నాగేంద్రారెడ్డి, భూమి రెడ్డి కొండారెడ్డి, లక్కిరెడ్డి హనుమారెడ్డి, పోతు రమణారెడ్డి, దాదిరెడ్డి మాలకొండ రెడ్డి, కటికల వెంకటరత్నం, కమతం రమణారెడ్డిలు పాల్గొన్నారు.

గాలెమ్మ మృహదేహానికి ఘన నివాళి

విశాలాంధ్ర-పెద్దారవీడు : పుచ్చకాయలపల్లి గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మారంరెడ్డి గాలెమ్మ మృతదేహానికి ఎర్రగొండపాలెం నియోజకవర్గ సమన్వయకర్త తాటిపర్తి చంద్ర శేఖర్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయనతో పాటు ఏపీ ఇరిగేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడుతోకల ఆవులయ్య యాదవ్,కొత్తపల్లి సర్పంచ్ వెన్నా శివకృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు పోతిరెడ్డి నారపరెడ్డి, మారంరెడ్డి మల్లారెడ్డి, వైసీపీ నాయకులు వజ్రాల ఆదిరెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ మారంరెడ్డి శివారెడ్డి ఉన్నారు.

జనసేన సెంట్రల్ ఎన్నికల కమిటీ సభ్యుడిగా శ్రీధర్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జనసేనపార్టీ సెంట్రల్ ఆంధ్ర ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులుగా చీరాల నుండి ఆలా శ్రీధర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో తోట రాజాతో కలిసి పార్టీ విజయానికి కృషి చేస్తామ న్నారు. ఈ అవకాశం కల్పించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు,పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు,ఆలా అనిల్ కుమార్‌కు ధన్యవాదములు తెలిపారు.

హామీలపై వెంటనే జీవో విడుదల చేయాలి

విశాలాంధ్ర-కనిగిరి : ప్రభుత్వం ఇటీవల మున్సిపల్ కార్మికుల సమ్మె విరమించే క్రమంలో కార్మికులకు ఇచ్చిన హామీలపై వెంటనే జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కనిగిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూని యన్ నాయకులు షేక్ నాసర్ వలి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల 15 డిమాండ్లను ఒప్పుకున్న ప్రభుత్వం రెండు నెలలు గడిచిన జీవోలు విడుదల చేయ కపోవడం దారుణమన్నారు. సమ్మెలో మున్సిపల్ వర్కర్స్ న్యాయమైన డి మాండ్లను పరిష్కరిస్తామని చెప్పిన మంత్రివర్గ సభ్యులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. కరోనా సమ యంలో తీసుకున్న కార్మికులను అప్కాస్ నందు నమోదు చేసి జీతాలు చెల్లించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు వేసిన కమిటీ ప్రకారం స్కిల్డ్, సెమిస్కిల్డ్, హైస్కిల్డ్ విభజించి కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. ఎల్ఈడి విద్యుత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ హామీ ఇచ్చిన డిమాండ్లకు జీవోలు ఇవ్వాలని నినాదాలు చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం కమీషనర్ డానియల్ జోసెఫ్ కు అందచేశారు. మునిసిపల్ అధ్యక్ష కార్యదర్శులు ఆలూరి కోటయ్య, అశోక్, గంగవరపు కిరణ్, సుబ్రమణ్యం, సాల్మన్, రవి, మధు, ఐజక్, శేషయ్య, సుధా కర్, సూరి బాబు, జీవన్, మస్తాన్ పాల్గొన్నారు.

వాహనదారుల కష్టాలు తీరేనా..?

విశాలాంధ్ర - చీరాల రూరల్ : గుంటూరు, బాపట్ల, చీరాల ప్రధాన రహదారిలో వాహనాలు విజయవాడ వెళ్ళడానికి అందుబాటులో ఉన్న రహదారి. కానీ రోడ్డుపై అడుగుకో గుంటపడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంటలలో పడి ప్రమాదాల పాలై గాయపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.వాహనాలు ఈ రహదారిలో ప్రయాణం చేయాలంటే బోదకలు అప్రమత్తంగా ఉంటూ ఏకాగ్రతతో సవ్య సాచిలా నడిపితే తప్ప సురక్షితంగా ఊరు దాటలేరు. అయినప్పటికీ వాహనాలకు మరమ్మతులు, ప్రయాణీకులకు ఇక్కట్లు తప్పడం లేదు.వర్షం పడితే గుంటల్లో నీరు నిలవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు పత్రికల్లో ఎన్నోసార్లు వాస్తవ పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించినప్పటికీ అధికారుల్లో చలనం శూన్యం. మంగళవారం మండలంలోని ఈపురుపాలెం పంచాయితీ పరిధిలో గోతులు పడి, మరమత్తులకు గురైన ఆ ప్రధాన రహదారిని అధికారులతో కలిసి ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి పరిశీలించారు.ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో బిట్రా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, మునిసిపల్ డీఈ యేసయ్య, ఆర్.అండ్.బీ డీఈ నరసింహులు,ఏఈలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఇకనైనా రహదారి మరమ్మత్తులకు నోచుకుని తమ కష్టాలు తీరుతాయని వాహనదారులు, ప్రజలు భావిస్తున్నారు.

డీఈవో నారాయణను కలిసిన సురేష్

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల విద్యాశాఖాధికారి కె.నారాయణరావును మంగళవారం కర్లపాలెం శ్రీ భార్గవి విద్యాసంస్థల అధినేత పేరాల వెంకట సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అన్నదానం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఆర్యవైశ్య సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో జీ.శ్రీను,లాయర్ గోపాలకృష్ణ, కూనిశెట్టి శివల ఆర్థిక సహకారంతో చీరాల ఓవర్ బ్రిడ్జి వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాతులూరి సుధాకర రావు,గౌరీనాథ్,గాయత్రి,రమేష్,రేవతి,కొత్త నాగమల్లేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డిని నమ్మి మోసపోయిన బీసీలు

- ఎం. గౌరీ అమర్నాథ్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : గత ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నమ్మి బీసీలు మోసపోయారని చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి మద్దులూరి మాల కొండయ్య తనయుడు యువనాయకులు ఎం. గౌరీ అమర్నాథ్ అన్నారు.మంగళవారం స్థానిక తెదేపా కార్యాలయంలో మాట్లాడుతూ వైకాపాలో జగన్ రెడ్డి ఒంటెద్దు పోకడతో బీసీ నాయకులు ఇమడలేక బయటకు వస్తున్నారన్నారు. బీసీ సెల్ ప్రెసిడెంట్‌గా పని చేసిన జంగా కృష్ణమూర్తి,బీసీ నాయకులకు పార్టీలో గౌరవం లేదన్నారని తెలిపారు.బీసీల ద్రోహి జగన్‌మోహన్ రెడ్డి అని వైకాపాలోని నేతలే అంటున్నారన్నారు.బీసీలపై జగన్ రెడ్డిది కపట ప్రేమన్నారు.సామాజిక న్యాయం పేరుతో బీసీలను దగా చేస్తూ వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే జగన్ రెడ్డి చూస్తున్నారన్నారు.బీసీలకు పవర్‌లేని తాత్కాలిక పదవులిచ్చి అవమానాలకు గురిచేస్తున్నారన్నారు.జనాభాలో అధికశాతం ఉన్న బీసీలకు వైకాపాలో న్యాయం జరగలేదన్నారు.నేతి బీరకాయలో నెయ్యెంత నిజమో జగన్‌మోహన్ రెడ్డి వైకాపాలో సామాజిక న్యాయం అంతే నిజమని 56 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కార్పొరేషన్లకు నిధులు లేకుండా చేశారన్నారు.స్థానిక 25 వార్డులోనూ, మండలంలోని కావూరివారిపాలెం ఆంధ్రకేసరి నగర్‌లోనూ బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాల్లో మద్యం చిచ్చు

- ధరలు పెరగటం, నాణ్యత లేకపోవడంతో ఆర్థికంగా ఆరోగ్యపరంగా సమస్యలు
- నెరవేరని మద్య నిషేధం హామీ

విశాలాంధ్ర-కనిగిరి : అధికారంలోకి వచ్చిన వెంటనే దశలవారీగా మద్యాన్ని నిషేధిస్తాం ..అక్క చెల్లెల కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న మద్యాన్ని స్టార్ హోటల్ కి పరిమితం చేస్తామని ప్రతిపక్షంలో ఉండగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పిన మాటలు ఇవి... అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన హామీని పూర్తిగా విస్మరించారు. పైగా మద్యం దుకాణాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుపుతూ రాష్ట్రానికి ప్రధాన ఆదాయంగా మార్చారు .ఇంకా ధరలు విపరీతంగా పెరగటం.. నాణ్యత లేకపోవడంతో మందుబాబులు ఆర్థికంగా ఆరోగ్యపరంగా దెబ్బతింటున్నారు. గడిచిన 20 ఏళ్ల నుంచి మద్యాన్ని తాగుతున్నానని, గడిచిన ఐదేళ్ల నుంచి అమ్ముతున్న మద్యాన్ని ఎప్పుడూ చూడలేదని మందుబాబులు వాపోతున్నారు. నాణ్యత లేని మద్యం తాగుతుండటంతో కడుపులో మంటగా ఉండి అల్సర్... జీర్ణాశయ సమస్యలతో పాటు అనారోగ్యానికి గురవుతున్నారని రోజువారి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయంలో సగానికి పైగా మందుకి :

ప్రతినిత్యం భవన నిర్మాణరంగా కూలీలు, అసంఘటిత కార్మికులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు.. నిత్యం ఏదో ఒక శారీరక శ్రమ చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారు. అయితే రాత్రికి శారీరక శ్రమ నుంచి కొంత ఉపశమనం పొందటానికి మద్యం తాగుతుంటామని కూలీలు చెబుతున్నారు. రోజుకు 500 సంపాదించే కూలి సాయంకాలానికి క్వార్టర్ బాటిల్ రూ. 200, ఇతర ఖర్చులకు రూ.100 పెట్టి మిగిలిన రూ. 300 రూపాయలు ఇంట్లో ఇవ్వటంతో కుటుంబ పోషణ జరగక కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.దీంతో పాటు నాసిరకమైన మద్యం తాగటం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంపూర్ణ మద్యపానం నిషేధంగా అడుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

లకావత్ మణికంఠ, తండ్రి బాజి అను నేను కృష్ణా జిల్లా పెనమలూరు మండలం, లంబాడి పేట, డోర్ నెం:16-122 యనమలకుదురు గ్రామం నివాసినై యున్నాను.అయితే నేను ఆరేపల్లి గౌతయ్య దగ్గర ఆర్.సి.సి.బిల్డింగ్ లీజుకు తీసుకున్నాను. అయితే నగరం నుండి రేపల్లె ఆటోలో ప్రయాణం చేయుచుండగా డాక్యుమెంట్లు పోయినవి.ఎంత వెతికిననూ కనిపించలేదు. లీజు డాక్యుమెంటు నెం:4196/2013. సర్వే నెం:198-3. ఎవరికైనా దొరికిన యెడల సెల్ నెం: 9848503448 కు గానీ పై అడ్రస్సుకు గానీ తెలియజేయగలరు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-పర్చూరు: రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరాగా ప్రభుత్వం కృషి చేస్తుందని వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. మండలంలోని చెరుకూరులో మంగళవారం ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా 4వ విడత చెక్కులను ఆమంచి పంపిణీ చేశారు. ఆమంచి మాట్లాడుతూ ప్రభుత్వ విద్య, వైద్యంతోపాటు మహిళల సంక్షేమం కొరకు క్రమంతప్పకుండ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. మండలంలో మొత్తం 1,173 గ్రూపులలో 11,524 మందికి రూ.10.04 కోట్లు నగదును ప్రభుత్వం మంజూరు చేసిందని ఆమంచి తెలిపారు. కేక్ కట్‌చేసి సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఏపిఎం వంకాయలపాటి లాజరు, వైస్ఎంపిపి పాలేరు వీరయ్య, సర్పంచ్ పేరం సుబ్బారావు, ఈఓఆర్డీ రామకృష్ణ, కార్యదర్శి కొసనా సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు కటారి అప్పారావు, పార్టీ నాయకులు కోట శ్రీనివాసరావు, ముప్పాళ్ళ రాఘవయ్య, జంగా అనిల్, గాదె సురేష్, నూతలపాటి బలరామ్, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, వీఓఏలు, తదితరులు ఉన్నారు.

రేపు పర్చూరులో కార్మికుల ధర్నా

విశాలాంధ్ర-పర్చూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న స్థానిక బొమ్మల సెంటర్ నందు ఉదయం 10 గంటలకు ధర్నా జరుగుతుందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి శంకరయ్య ప్రకటన లో తెలిపారు. ధర్నాలో రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-అద్దంకి : కొరిశపాడు మండలం మేదరమెట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో మంగళవారం డా,వైయస్సార్ నాలుగవ విడత ఆసరా చెక్కులను నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. ఈసందర్భముగా హనిమిరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సందర్భముగా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయించారన్నారు.వచ్చే ఎన్నికల్లో అక్కచెల్లెమ్మలు అందరూ జగన్‌కు అండగా ఉండి మరలా రాష్ట్రంలో వైసీపీని అధికారంలోకి తీసకురావాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

16న భారత్ బంద్‌కు ఏఐటీయూసీ మద్దతు

విశాలాంధ్ర - రేపల్లె : కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు గొట్టుముక్కల బాలాజీ, మురుగుడు సత్యనారాయణ, మర్రివాడ వెంకట రావులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడు తుందని వారు ఆరోపించారు. ఎన్నికల సమయంలో బిజెపి అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ యువతను మోసం చేశారని విమర్శించారు. ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసేందుకు నరేంద్రమోడీ పూనుకున్నారని బాలాజీ, సత్య నారాయణ, వెంకటరావులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిఐటియు,ఏఐటియుసి, ఏఐఎఫ్‌టియు నాయకులు జి.నాగరాజు, మనోజ్, కొడాలి రామ కోటేశ్వరరావు, దొంతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

21న మాతృభాషా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా రచయితల సంఘం, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల,బత్తుల బ్రహ్మారెడ్డి ట్రస్ట్ సంయుక్తంగా ఈ నెల 21 తేదీన స్థానిక రోటరీ కల్యాణ మండపంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ ,ప్రధాన కార్యదర్శి నందిరాజు విజయ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా సాహిత్య రంగానికి విశేష సేవలందించిన డాక్టర్ నారాయణం శేషుబాబు,అబ్దుల్ హఫీజ్,వంగర శ్రీధర్‌లను పెన్మెత్స నాగరాజు సౌజన్యంతో పెన్మెత్స శ్రీరామరాజు సాహిత్య పురస్కారాలతో సత్కరించ నున్న ట్లు తెలిపారు. తెలుగు భాషాభివృద్ధి లక్ష్యంతో రాష్ట్రస్థాయి వచన కవితల పోటీలను నిర్వహిస్తున్నా మని, ప్రథమ బహుమతిగా రూ.1,116, ద్వితీయ తృతీయ బహుమతులుగా రూ.516, మెమెంటోలను బహుకరించనున్నామని, కవితలు ఈ నెల 18వ తేదీలోగా 95027 60757 వాట్సాప్ నెంబరుకు పంపించవలసిందిగా వారు కోరారు. కార్యక్రమంలో మాతృ భాషా ఔన్నత్యంపై ధవిళేశ్వరపు జగదీశ్‌చే వ్యక్తిత్వ వికాస ప్రసంగము, భాగి కృష్ణమూర్తిచే తెలుగు పద్య గానాలాపన,కామరాజుగడ్డ శ్రీనివాసరావు దర్శకత్వంలో ఎయిమ్ ఫర్ సేవ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులచే సందేశాత్మక హాస్య నాటిక ప్రదర్శించ బడుతుందని వివరించారు.

జాతీయస్థాయి స్కిప్పింగ్ పోటీల్లో శ్రీ సరస్వతి విద్యార్థులు

విశాలాంధ్ర-తాళ్లూరు : జాతీయస్థాయి స్కిప్పింగ్ పోటీలలో మండల కేంద్రమైన తాళ్లూరులోని శ్రీ సరస్వతీ హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభతో విజేతలుగా నిలిచారు. సౌత్ జోన్ నేషనల్ రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్షిప్ జాతీయ స్థాయి పోటీలు గుంటూరులోని శ్రీ మాదేడి గురవయ్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. దానిలో అండర్ 14 విభాగంలో స్పీడ్ హెూప్ స్కిప్పింగ్ పోటీలలో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని పూర్ణిమ జాతీయస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. అదేవిధంగా అండర్ 17 స్పీడ్ స్ప్రింట్ పోటీలలో 9వ తరగతి విద్యార్థిని పావని ద్వితీయ స్థానం సాధించి ంది. డబుల్ టచ్ గ్రూపులో బాలికల విభాగంలో స్నేహలతరెడ్డి, బ్లేస్సిలు ద్వితీయ స్థానం సాధించారు. అదేవిధంగా అండర్ 17 డబుల్ టచ్ స్పీడ్ స్కిప్పింగ్ విభాగంలో అండర్ రిలే పోటీలలో ఈశ్వర్, సురేంద్ర రెడ్డి, సాయి చరణ్, నెహేమియాలు ద్వితీయ స్థానం సాధించి జాతీయస్థాయిలో శ్రీ సరస్వతి హై స్కూల్ పేరు ప్రఖ్యాతులను ఇనుమడింప చేశారు. జాతీయ స్థాయి స్కిప్పింగ్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులను శ్రీ సరస్వతీ హై స్కూల్ ప్రాంగణంలో శ్రీ సరస్వతీ విద్యాసంస్థల చైర్మన్ ఏవి రమణారెడ్డి ప్రశంసాపత్రాలు అందించి అభినం దించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు వి శ్రీరామమూర్తి, డీన్ వెంకట్ రెడ్డి వ్యాయామ ఉపాధ్యా యులు, ఇతర ఉపాధ్యాయులు అభినందించిన వారిలో ఉన్నారు.

ఈ - కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయండి

విశాలాంధ్ర-తాళ్లూరు : పీఎం కిసాన్ లబ్ధిదారులకు సంబంధించిన ఈ కేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన దోసకాయల పాడు గ్రామంలో పర్యటించి రైతు భరోసా కేంద్రం నందు గ్రామ వ్యవసాయ సహాయకులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకానికి అర్హత సాధించి ఇప్పటివరకు ఈ కేవైసీ పూర్తి చేసుకోనటువంటి మిగిలిపోయిన వారిని వెంటనే ఈ కేవైసీ 100% పూర్తి చేసే విధంగా గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రయత్నించాలని ఆయన తెలిపారు. అన్ని అర్హతలు ఉండి ఈ కేవైసీ చేయించుకోకపోవడం వల్ల పీఎం కిసాన్ పథకాన్ని పొందలేక ఉన్నటువంటి వారిని గుర్తించి వెంటనే ఈ కేవైసీ పూర్తి చేయాలని ఆయన తెలిపారు. రానున్న పది రోజుల వరకు కామన్ సర్వీస్ సెంటర్ పనిచేస్తుందని అందువల్ల 100శాతం ఈ కేవైసీ పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు భార్గవి, రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన నిరుపేద క్యాన్సర్ బారిన పడి హైదరా బాదు బసవతారకం క్యాన్సర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సత్యన్నారాయణకు వైద్య ఖర్చుల కోసం మంగళవారం రోటరీ సభ్యులు,దాతలు రూ 6,500 రూపాయలను ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, దేవ పాలన, చుండూరి మురళీసుధాకర్ పాల్గొన్నారు.

18న వైసీపీ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-అద్దంకి : ఈనెల 18న స్థానిక వాసవీ కళ్యాణ మండపం నందు వైసీపీ అద్దంకి పట్టణ ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వైసీపీ నాయకులు సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ మంగళవారం తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం వైసీపీ ఆర్యవైశ్య ప్రము ఖులు చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంను చీరాలలో కలిసి సమ్మేళన కార్యక్రమానికి రావల్సిందిగా కోరారు. బలరాంను కలిసిన వారిలో ఆర్యవైశ్యులు గుంటూరు మాధవరావు, ఊడత్తు సురేష్,కూరపాటి రామకోటి,చిలకల సుబ్బారావు, చిన్ని శ్రీమన్నారాయణ ఉన్నారు.

18న జనసేన కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - రేపల్లె : నియోజకవర్గ జనసేన పార్టీ నూతన కార్యాలయం ఈ నెల 18 ఆదివారం ప్రారంభిం చనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ తెలిపారు.మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభో త్సవానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్,ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. కార్యాలయ ప్రారం భోత్సవ సందర్భంగా పట్టణంలో వివిధ వార్డుల్లో జనసేన పార్టీ జెండాల ఆవిష్కరణ, ర్యాలీలు, భారీ ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జనసేన,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, వీరమహిళలు, పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ కార్యాలయ గోడ పత్రికను ఆవిష్కరించారు.

చింతగుంట్ల వారి వివాహ వేడుకల్లో యాదాల

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని అంకాలమ్మ వీధికి చెందిన చింతగుంట్ల రమేష్ (వర్మ) కుమార్తె వివాహ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల వైఎస్ఆర్సిపి యూత్ అధ్యక్షులు, పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్ పాల్గొని నూతన వధువు ను ఆశీర్వదించారు. మాజీ సర్పంచులు డి.వి. మనోహర్, కావిటి సబ్బయ్య, బీసీ సెల్ నాయకులు చల్లా సుబ్బారావు, వార్డు మెంబర్లు పిడుగు శ్రీనివాసులు, ఒగురి ఏడుకొండలు, వాయునేని రాఘవ తదితరులున్నారు.

అన్నదానం ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-కొమరోలు : గిద్దలూరులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి భారత జాతి కోసం అమరత్వం చెందిన రోజు ఫిబ్రవరి 22న డిజిఆర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం నరవ రోడ్ నందు కనివిని ఎరుగని రీతిలో వర్ధంతిని ఏర్పాటు చేస్తున్నామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి తెలియజేశారు. మంగళవారం కొమరోలు లోని కామూరి రమణారెడ్డి అన్నదాత స్వగృహంకు వెళ్లి 1000 మందికి భోజన సౌకర్యం ఏర్పాటు చేయాలని మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కామూరి రమణారెడ్డి అన్నదాతను అడిగి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు చెప్పగానే చాలా మంచిది రుచికరంగా పాల్గొనే వారికి భోజనం ఏర్పాటు చేసుకోండి నేను ఏర్పాటు చేస్తానని చెప్పారన్నారు. వెయ్యి మంది ప్రజలకు భోజనం ఏర్పాటు చేస్తున్న అన్నదాతకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కమిటీ తరపున వారికి వారి కుటుంబానికి హృదయపూర్వక ధన్య వాదములు తెలియజేసుకుంటున్నామని సభ్యులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, బియస్ నారాయణరెడ్డి సంఘసేవకులు, సామాజిక కార్యకర్త వడ్డే వెంకటరామిరెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

విశాలాంధ్ర-కొమరోలు : మార్కాపురంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అధ్వర్యంలో జరిగిన పరిచయ కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు నూతన సమన్వయ కర్త మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి కొమరోలు మండల వైసీపీ నాయకులు కార్యకర్తలు పూలమాలలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ అందరూ కలిసి గట్టిగా పని చేసి ఎమ్మెల్యేగా నాగార్జునరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జడ్పీటీసీ సారె.వెంకట నాయుడు, మండల సీనియర్ నాయకుడు నాదెళ్ల వెంగయ్య చౌదరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మరియు తదితర నాయకులు కార్యకర్తలు అన్నా అభిమానులు పాల్గొన్నారు.

సీఎం జగన్ మహిళా పక్షపాతి

తాటిపర్తి చంద్రశేఖర్

విశాలాంధ్ర-పెద్దారవీడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి మహిళా పక్షపాతి అని యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో మహిళా రుణాలను మాఫీ చేసిన ఘనత ఒక్క జగన్నా కే సాధ్యమైందన్నారు. నాలుగో విడతగా మండలంలోని పొదుపు మహిళలకు 551 గ్రూపులకు 5557 లబ్దిదారులుకి రూ.3 కోట్ల 18 లక్షల 23 వేల 227 రూపాయలను అక్క చెల్లెమ్మలకు నేరుగా లబ్ధి చేకూర్చి అక్కచెల్లెమ్మల జీవితాల్లో నిజమైన కాంతులు నింపిన జగనన్న అని తెలియజేశారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు నేరుగా తీసుకెళ్లి లక్షల మంది జీవితాల్లో వెలుగు నింపడం జరిగిందని,నాడు నేడు ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసి విద్యార్థుల భవిష్యత్తుకు నంది పలికారని, గత టిడిపి ప్రభుత్వంలో వెలుగొండ ప్రాజెక్టు 5 ఏళ్లలో చేసింది 6.30 మాత్రమేనని దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కలిపి 32 కిలోమీటర్లు పూర్తి చేసిన ఘనత తండ్రి తనయులకే దక్కుతుంది.వెలుగొండ ప్రాజెక్టును త్వరలోనే సీఎం జగనన్న జాతికి అంకితం చేసి ప్రజలకు తాగునీరు,సాగునీరు అందించేందుకు చర్యలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పొదుపు సంఘాల మహిళలు పాలభిషేకం చేశారు.మహిళా అక్క చెల్లెమ్మలు ఏర్పాటు చేసిన స్టాల్స్ చూసి వాళ్లకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ దుగ్గెంపుడి వెంకట రెడ్డి,ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య,జెడ్పీటీసీ ఏరువ చలమ రెడ్డి,మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణా రెడ్డి, వైస్ ఎంపీపీలు,ఎంపీటీసీలు సర్పంచులు,వైసీపీ నాయకులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మేరుగు నాగార్జున

విశాలాంధ్ర-సంతనూతలపాడు : గ్రామాలలోని రెవెన్యూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిం చేందుకు కృషి చేయాలని తహసీల్దారులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎస్ ఎన్ పాడునియోజక వర్గ సమన్వయకర్త మేరుగు నాగార్జున సూచించారు, ఒంగోలు కార్యాలయం నందు మంగళవారం నియోజకవర్గం నాలుగు మండలాల తహసిల్దారులతో సమీక్ష సమావేశం జరిగింది. నాగార్జున మాట్లాడుతూ తమ మండలాలు పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీలలో ఉన్న అన్ని సమస్యలను ప్రజలకు అందుబాటులో ఉండిక్రింది స్థాయి ఉద్యోగస్తులతో మమేకమై పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ పాడు డీటీ శాంతి, చీమకుర్తి ఎమ్మార్వో సురేష్, మద్దిపాడు డీటీ ఆశాజ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : పశు పోషకుల ముంగిట నేటి లేగ దూడలే పాడి పశువులని పశు సంవర్థక జిల్లా అధికారిని కే బేబీ రాణి పేర్కొన్నారు. మండలంలోని వేములపాడు పంచాయతీ పరిధిలోని మట్టిపాడు గ్రామము నందు పశుగణా అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మేలు జాతి లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ కె బేబీ రాణి మాట్లాడుతూ మేలు జాతి లేగ దూడలను సంరక్షించడం ద్వారా పాడి రైతులు ఆర్థికంగా బలపడతారని అన్నారు. దాడి రైతులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు గణాభివృద్ధి అధికారులు డాక్టర్ డి కృష్ణారావు బి.ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ ఈర్ల విజయమ్మ రైతులు మండవ వెంకటనారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమ శిక్షణ

విశాలాంధ్ర-దొనకొండ: ఎన్‌సీసీతో విద్యార్థు లలో క్రమ శిక్షణ అలవడుతుందని ఒంగోలుకు చెందిన 34 బెటాలియన్ కమాండింగ్ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వివి రామాంజనేయులు అధ్యక్షతన ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి కమాండర్ సత్య నారాయణ, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 28 పాఠశాలలలో, 12 కళాశాలల్లో మొత్తం 2740 మంది విద్యార్థులు ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులు సమాజ సేవలో ఎంతగానో దేశ వ్యాప్తంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. దొనకొండలో యూనిట్ వచ్చేందుకు హెచ్ఎం రామాంజనేయులు, పీడీ నరసింహారావు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులకు పలు సూచన, సలహాలందించారు. ఎంపీపీ ఉషామురళీ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులను చూసి మిగిలిన వారు స్ఫూర్తి పొందాలని, ప్రస్తుత సమాజంలో యువత తప్పు దోవ పట్టకుండా ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ముందుగా పాఠశాలలో ఎన్‌సీసీ కార్యాలయం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం అతిథులను ఉపాధ్యాయ సిబ్బంది శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎన్.సాంభశివరావు, షేక్.అమీర్, పీఎంసీ వైస్ చైర్మన్ సుధీర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేటు కార్యక్రమంలో బూచేపల్లి

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని పెదన్న పాలెం పంచాయతీ చిన్నగుడిపాడు చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త గుడిపాటి నాసరయ్య కుమార్తె నిశ్చి తార్థానికి దర్శి నియోజకర్గం ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి హాజరయ్యారు. కాబోయే వధూ వరులను అంక్షితలు వేసి ఆశీర్వదించారు. ఆయన వెంట కాపా రమణారెడ్డి, మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి, కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి, గుంటు పోలయ్య, కె.నాగరాజు, ఐలూరి శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

పోలేరమ్మకి ఫ్యాన్‌లు బహూకరణ

విశాలాంధ్ర-కురిచేడు : ప్రకాశం పల్నాడు జిల్లా సరిహద్దులో ఆనుకుని ఉన్న శ్రీ నరసాయపాలెం పోలేరమ్మ దేవాలయానికి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ నెంబర్ కపురము శ్రీనివాసరెడ్డి రెండు ఫ్యాన్లను బహూకరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ ఆర్ సుమన్ చేతుల మీదుగా ఆలయ కమిటీ వారికి అప్పగించారు. కార్యక్రమంలో వీరితోపాటు మాజీ సొసైటీ అధ్యక్షులు పుట్ల వెంకటేశ్వర్లు బోరి గొర్లచిన్న గోవింద నుసుం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కమిషనర్‌ని కలిసిన పర్రె కోటయ్య

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత దళిత గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కోటయ్య మాట్లాడుతూ ఎస్సీలకు కేటాయించిన షాప్‌లను రీ మోడలింగ్ చేసి ఎస్సీలకే ఇవ్వాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం కన్వీనర్ విజయ రాజారావు పాల్గొన్నారు.

నేడు వైసీపీ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-దర్శి : దర్శి వైసీపీ ఇంచార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైసీపీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులుచెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని శివప్రసాద్ రెడ్డి అన్నారు నియోజకవర్గ మండల పార్టీ నాయకులు కార్యకర్తలు బూచేపల్లి అభిమానులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

విశాలాంధ్ర-తాళ్లూరు : తూర్పు గంగవరం ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వెలుగువారిపాలెంలో గల మండల పరిషత్ ప్రాథమిక(ఏపి) పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలోని విద్యార్థినీ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు .ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాక మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, అంగన్వాడీ కార్యకర్త సునీత, సి హెచ్ ఓ ప్రభావతి, ఏఎన్ఎం సుజాత, ఆశ వాలంటీర్లు అంజమ్మ, శ్రీదేవి, పద్మావతి, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేయాలి: తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రజల వెన్ను తట్టి కదిలించాలని వైసీపీ మండల నాయకులు ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజలను చైతన్య పరచాలని మాజీ జడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వైసీపీ ఎంపీటీసీలు సర్పంచులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని నేటినుండి సందర్శించి రాబోవు ఎన్నికలకు సిద్ధం చేయాలని ప్రజల వెన్ను తట్టి నడిపించాలని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని రాబోయే రోజులలో నాయకత్వం కావాలంటే పనిచేయక తప్పదని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామన మహాలక్ష్మి, నాగూర్ యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ పోల్లా సుబ్రమణ్యం, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్, పాణ్యం మురళి, దాదా సోమయ్య, పలువురు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

నలుగు పాటల పోటీలు

విశాలాంధ్ర - బాపట్ల : డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి 126వ జయంతి సంద ర్భంగా అంబేద్కర్ భవనంలో మంగళవారం మాల పేరంటాల పెళ్లి నలుగు పాటల పోటీలు నిర్వహించారు. మాల మహాసభ, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో 14 టీములు పాల్గొన్నాయి.ఆరు టీంలు న్యాయ నిర్ణీతలు గా మరో ఆరు టీమ్‌లకు సమానంగా అందజేశారు.పోటీలో పాల్గొన్న ప్రతి టీమ్‌కు ప్రోత్సాహకంగా రూ.1500లు అందజేశారు. గణపవరం,పేరలిపాడు, మూలపాలెం, చింతావారిపాలెం,నరసాయపాలెం,హైదర్‌పేట గ్రామాలకు చెందిన టీములు విశిష్ట ప్రతిభ కనబరిచారు.మాల మహాసభ వ్యవస్థాపకులు,పీపుల్స్ రి పబ్లికన్ పార్టీ అధ్యక్షులు మల్లెల వెంకట రావు పర్యవేక్షణ చేశారు. న్యాయం నిర్ణయతలుగా జి.లజపతి రాయ్, ఎండ్రపాటి అశోక్,నక్క భాను,దగ్గుమల్లి కిరణ్ కుమార్,అడే బుజ్జి, గొర్రు ముచ్చు వందనం,చల్లపల్లి కోటేశ్వరరావు, కోటయ్య, గుదే రాజారావు వ్యవహరించారు.

నేడు అమృత్ సరోవర్‌కు భూమి పూజ

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని ముక్తేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలోని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో (అమృత్ సరోవర్) నీటి నిల్వ కోసం ఒక ఎకరా భూమిని కేటాయించారు.ఉపాధి హామీ పథకం నిధులతో సుమారు రూ.27 లక్షలతో నిర్మించనున్న ఈ నీటి నిల్వ కుంటకు మధ్యాహ్నం 2 గంటలకు భూమి పూజ చేయనున్నట్లు ఎంపీడీవో హనుమరెడ్డి,ఏపీవో బాలకృష్ణ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ భూమి పూజకి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష,నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పానెం హనిమిరెడ్డి ముఖ్య అతిథులుగా రానున్నట్లు తెలిపారు.

16న కార్మికుల సమ్మెను, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.), ఏఐఎఫ్టీయూ (న్యూ) ప్రకాశం జిల్లా శాఖల ప్రదర్శన, సభలలో వక్తల పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు : బీజేపీ పాలకుల కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగానూ, వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగానూ, ఈనెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మికుల సమ్మెను, గ్రామీణ భారత్ బంద్ ను విజయవంతం చేయాలని నినదిస్తూ ఈమని పాలెం తరిమెల నాగిరెడ్డి భవన్ నుండి హెడ్ పోస్టాఫీస్, చర్చి సెంటర్, ప్రకాశం భవన్ మీదుగా నెల్లూరు బస్టాండ్ వరకు కార్మిక-కర్షక ప్రదర్శన జరిగింది.ఈ ప్రదర్శన అనంతరం ఏఐఎఫ్టీయు (న్యూ) నాయకులు కామ్రేడ్ కత్తి పేరయ్య అధ్యక్షతన తరిమెల నాగిరెడ్డి భవన్ లో జరిగిన సభలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(న్యూ) రాష్ట్ర కోశాధికారి కామ్రేడ్ డి.వి.ఎన్. స్వామి మాట్లాడుతూ ఈ దేశపు సహజ సంపదలను, శ్రమశక్తిని కారుచౌకగా దోచుకునేందుకు విదేశీ-స్వదేశీ కార్పొరేట్ శక్తులకు సహకరిస్తూ, వారికి ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వ దేశద్రోహ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక కర్షక ఐక్య ఉద్యమాలు జరగాలని పిలుపునిచ్చారు. ఈ సభలోరైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎస్.లలిత కుమారి మాట్లాడుతూ వ్యవసాయాన్ని సామ్రాజ్యవాదుల రథచక్రాలకు కట్టబెడుతున్న పాలకులే దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు పూర్తిగా బాధ్యత వహించాలని, ఈ దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గంతో కలిసి ఐక్య ఉద్యమాలు ముందుకు తీసుకుపోతామని స్పష్టం చేసారు.ఈ కార్యక్రమంలో ఇంకా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఐ.విజయసారథి, ఏఐఎఫ్టియు (న్యూ) జిల్లా నాయకులు కామ్రేడ్ ఎం.ఎస్.సాయి మాట్లాడారు. ఏఐఎఫ్టీయూ (న్యూ) నాయకులు కామ్రేడ్ సుల్తాన్ బాషా, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కామ్రేడ్స్ జయబాబు, వి.శ్రీరాములు, శ్రీనులి తదితరులు పాల్గొన్నారు.

నీలం నాగేంద్రకు కృతజ్ఞతలు

- కోర్టు షరతుల తొలగింపు - గన్‌మెన్ కేటాయింపు కోసం పోరాడాలని నీలం సూచన

విశాలాంధ్ర-ఒంగోలు : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడు జనిపల్లి శ్రీను అలియాస్ కోడి కత్తి శ్రీను దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కోడి కత్తిశ్రీను నీలం నాగేంద్రకు ఫోన్ చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డిపై హత్యాయత్నం కేసులో కోడికత్తి శీను ఐదు సంవత్సరాల మూడు నెలలు జైల్లో గడిపారు. ఎన్ఐఏ కోర్టు శ్రీనుకు బెయిల్ ఇచ్చేందుకు పలుసార్లు నిరాకరించింది. వైయస్ జగన్మోహన్ రెడ్డి కోర్టుకు రాకుండా కేసు విచారణ జాప్యం అయ్యేందుకు కారణమయ్యారు. పైగా కుట్ర కోణం ఉందని సమగ్ర దర్యాప్తు జరపాలని కేసు విచారణను సాగదీశారు. ఈ కేసులో శీను నేరం చేయలేదని, ఒకవేళ తానే ఈ నేరం చేశానని శీను అంగీకరిస్తే, కేసు నమోదు కాబడిన సెక్షన్ల ప్రకారం రెండు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం శిక్ష పడే అవకాశం లేదు. రెండు సంవత్సరాల శిక్ష కాలం కూడా లేని కేసులో శ్రీను ఐదు సంవత్సరాల మూడు నెలల జైల్లో ఉండటాన్ని, శీను తల్లిదండ్రులు కోర్టులో సవాలు చేశారు. మొదట సలీం, తదనంతరం పిచ్చుక శ్రీనివాస్ అనే న్యాయవాదులు శ్రీనుకు బెయిల్ ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. కోర్టులో జాప్యం జరుగుతుండడంతో, ఈ రాష్ట్రంలో మొదటగా స్పందించిన దళితుడు నీలం నాగేంద్రరావు. శీను తల్లికి నాగేంద్ర 50 వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. విజయవాడలో జగన్ కోర్టుకు రావాలి అనే డిమాండ్ మొట్టమొదట రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు పరిణామాలు అనంతరం రాష్ట్రవ్యాప్తంగా దళితులు స్పందించారు. కోడి కత్తి శీనుకు మద్దతుగా ఎక్కడికక్కడ ఆందోళనలు చేశారు. శ్రీను తల్లితోపాటు శ్రీను కూడా నిరాహార దీక్షకు కూర్చున్నారు. హైకోర్టు శ్రీనుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పై విడుదలైన శీను సొంత ఇంటికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు నీలం నాగేంద్రరావు చేసిన సహాయాన్ని శ్రీనుకి గుర్తు చేశారు. దీంతో శ్రీను నాగేంద్ర కు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఒంగోలుకు వచ్చి వ్యక్తిగతంగా కలుస్తానని శ్రీను తెలిపారు. నాగేంద్ర శ్రీనుతో మాట్లాడుతూ కోర్టు విధించిన షరతులను తొలగించేందుకు కూడా న్యాయ పోరాటం చేయాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ లో ప్రాణభయం ఉన్న ఎస్సీ ఎస్టీలకు గన్‌మెన్‌ను కేటాయించే సౌకర్యం ఉందని, గన్‌మెన్‌ను నియమించుకోవాలని కోరారు. రిమాండ్ కాలంలో డిగ్రీ పూర్తి చేసినందుకు నాగేంద్ర శ్రీనుని అభినందించారు.

గంజాయి, చాక్లెట్లు పట్టివేత

విశాలాంధ్ర-చీమకుర్తి : జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి అదేశాల మేరకు అదనపు ఎస్పీ నాగేశ్వరావు నేతృత్వంలో చీమకుర్తి మండలం బుదవాడ గ్రామంలో బీహార్ వాసి రమేష్ సహనీ దగ్గర నుంచి 540 గంజాయి చాక్లెట్లు 3.480 గ్రాములు సుమారు 10 వేల రూపాయిలు విలువ కలిగిన చాక్లెట్లను ఎస్.ఈ.బి.సి.ఐ మారయ్య బాబు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం తప్పవని, సి.ఐ. మారయ్య బాబు తనదైన శైలిలో హెచ్చరించారు. సమీపంలో ఉన్న క్వారీలలో పనిచేసే వారినే టార్గెట్ చేసుకునే ఇలాంటి వారిపై నిరంతరం నిఘా ఉంటుందని, ఇలాంటి వాటికి సంబంధించి వివరాలను ఎస్.ఈ.బి. అధికారులకు తెలియజేస్తే వారి సమాచారం గోప్యంగా ఉంచి సంఘవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ రైడ్స్‌లో ఎస్.ఐ. వినితా రెడ్డి,యూసఫ్ షరీఫ్,కానిస్టేబుల్ రామిరెడ్డి,బాలసుబ్బయ్య, సురేష్,శ్రీనివాస్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిన 25 ఎస్సీ కుటుంబాలు



విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగానంద్ , సోమవరపు ఆరోగ్యం ఆధ్వర్యంలో రాచర్ల ఎస్సి పాలెంకు చెందిన 25 ఎస్సీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీలో చేరిన చిట్టెం భాస్కర్, చెట్టెం సుబ్బయ్య, తలపాటి సుధాకర్, చిట్టెం పోలయ్య, చిట్టెం ప్రభాకర్, చిట్టెం కిరణ్, పుల్లయ్య, ఏసోబు, ప్రవీణ్, చిట్టెం వెంకటయ్య, చిట్టెం భాస్కర్, గుర్రం చంద్రశేఖర్, చిట్టెం చిన్న, చిట్టెం పిచ్చయ్య, చిట్టెం ఏసోబు, చిట్టెం కన్న, చిట్టెం ప్రవీణ్ కుమార్, పోలా వెంకటేశ్వర్లు, సగినాల రంగస్వామి, పందిళ్లపల్లి శివ, చిట్టెం ఏసోబు, చిట్టెం వెంకటప్ప, షేక్ చాంద్ బాషా మరియు పార్లమెంట్ నాయకులు గోపిరెడ్డి జీవనేశ్వర రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, యామా సంజయ్, దప్పిలి కాశిరెడ్డి, షేక్ తాహిర్ బాషా, తలపాటి దివాకర్, పఠాన్ సనాఉల్లాఖాన్, సొంటం కళ్యాణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుమంత్ హత్య కేసులో నిందితులు అరెస్టు

- పాత వివాదాలు నేపథ్యంలోనే హత్య
- మీడియాతో డీఎస్పీ వెంకటేశులు

విశాలాంధ్ర – బాపట్ల : ఈ నెల 6వ తేదీన బాపట్ల సూర్యలంక రోడ్డులో జరిగిన సుమంత్ హత్యా కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం డీఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణానికి చెందిన వినోద్ స్థానికంగా కార్ ట్రావెల్స్ నిర్వహిస్తుంటాడని సుమారు ఏడాది క్రితం పట్టణానికి చెందిన రాహుల్‌తేజ పలు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉండగా అరెస్టు కాకుండా తిరుగుతుండగా వినోద్ పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టించాడని అప్పటి నుంచి రాహుల్ వినోద్‌పై కోపం పెట్టుకున్నాడని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని విజయకృష్ణ థియేటర్ యజమానిని, లాయర్ ఉసిరికాయల శ్రీనును సోను కత్తితో పొడవగా స్థానికంగా ఓ టీవీ చానల్‌లో పనిచేసే యాసిన్ ఆ వార్తను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశాడని సోను కక్షపెట్టుకున్నాడు. వినోద్ యాసిన్‌లు ఇరువురు చిన్ననాటి నుంచి స్నేహితులుగా కలిసి ఉండేవారన్నారు. మరోవైపు రాహుల్‌తేజ, సోను, మృతుడు వెంకటసుమంత్‌లు స్నేహితులుగా కలిసి ఉండేవారన్నారు. ఈ నేపథ్యంలో రెండు గ్రూపులుగా ఏర్పడి తరచు పట్టణంలో గొడవ పడుతూ ఉండేవారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన పట్టణంలోని జీబీసీ రోడ్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద రోడ్డుపై రెండు వర్గాలు గొడవ పడి చంపుతామని బెదిరించుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అదేరోజు రాహుల్‌తేజ, సోను, సుమంత్ మరికొంత మంది స్నేహితులు సూర్యలంక రోడ్డులోని పందెంకోడి రెస్టారెంట్‌లో ఉండగా వినోద్,యాసిన్‌లు వారి స్నేహితులు, బంధువులను తీసుకుని కత్తులు, కర్రలతో వెళ్లి దాడిచేయబోగా రాహుల్‌తేజ, సోనులు తప్పించుకోగా వారికి దొరికిన వెంకటసుమంత్‌ను కర్రలతో కొట్టి కత్తితో పొడిచి చంపివేశారన్నారు. ఈ హత్యకు 12 మంది పాల్పడినట్లు గుర్తించామని వారిలో 11 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నామని అరెస్టు చేసిన వీరిలో బుధవారం కోర్టులో హాజరపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల విషయంలో విఘాతం కల్గిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ట్రైనీ డీఎస్పీ శ్రీవిద్యా, సీఐలు హజరత్‌బాబు, శ్రీహరి, రూరల్ ఎస్సై రవిశంకర్‌రెడ్డి ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై ఆగ్రహం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాయంత్రం వాడి వేడిగా జరిగింది. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు, ధాన్యం కొను గోలు సిబ్బంది కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర రాకుండా ఇబ్బందులు పాలు చేస్తున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షులు కందుల వెంకట కోటేశ్వరరావు (కొండలు), సర్పంచులు నాగన బోయిన సునీల్ కుమార్ (అయ్యంకి), పంది కృష్ణ (మంత్రి పాలెం), వేములమడ సీతారామయ్య (వేములమడ), తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దీనిపై రైతులు అడిగినా ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది సమాధానం చెప్పకపోగా బాధ్యతారా హిత్యంగా ప్రవర్తిస్తున్నారని వెల్లడించా రు. ధాన్యం తేమ శాతం పై కూడా తేడాలు చూపించి మద్దతు ధరలో కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. దీనితో రైతులువేలాది రూపాయలు రైతులు నష్టపోయే పరిస్థితి సంభవించిందని వెల్లడించడంతో డిప్యూటీ తాసిల్దార్ సిహెచ్ గోపాల రావు, మండల వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్ దీనిపై తాము సమాచారం సేకరించి తగు చర్యలు చేపడతామన్నారు.

ఐలూరు నుంచి విడుదలయ్యే కృష్ణా జలాల తాగునీరు మా గ్రామాలకిరాదంటూ పెదసనగలు సర్పంచ్ కైతేపల్లి అన్నామణి, వేముల మడ సర్పంచ్ సీతారామయ్య ప్రశ్నించారు. జల జీవన్ మిషన్ ద్వారా పనులు పూర్తిచేసి తాగునీరు గ్రామాలకు ఎప్పుడు సరఫరా చేస్తారని, పెదముత్తేవి ఎంపిటిసి సభ్యురాలు ఉప్పలపాటి జ్యోతి తదితరులు ప్రశ్నించారు.. దీనిపై ఆర్ .డబ్ల్యు.ఎస్.ఏ.ఈ. కె ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ ద్వాక్రా సంఘాల మహిళలు పర్యవేక్షణలో త్వరలో పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏజెండాలో పొందు పరిచిన అంశాలను ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎం.డి.ఓ. జి. చంద్రశేఖర రావు, కృష్ణాజిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు పరిశుద్ధ రాజు పాల్గొన్నారు.

16న సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గన్నవరం : రైతు కార్మిక కుల వ్యతిరేక విధాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని జిల్లా రైతు నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం గన్నవరం సీపీఎం కాయలయంలో సీపీఐ సీపీఎం, తెలుగుదేశం ట్రేడ్ యూనియన్స్ రైతు సంఘాలు ఈ నెల 16 తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 10 సంవత్సరాలు వచ్చిన రైతు కార్మిక వర్గ సమస్యలు పరిష్కరించని కేంద్రప్రభుత్వం అని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు దోచిపెటెందుకు కుట్ర పనుతుందన్నారు. రైతు నాయకులు కాట్రగడ్డ రామచంద్ర జోషి మాట్లాడుతూ కేంద్రం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కనీస వేతనం 26 వేలు నిర్ణయించటంలో కేంద్రం అంగీకరించటం లేదని అన్నారు. బందను రైతు కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని ఆయన కోరారు. సీపీఐ రైతు సంఘం నాయకులు శనగల సుబ్బారెడ్డి, నూతక్కి మోహన్‌రావు, కట్టవరపు విజయరావు, సి హెచ్ వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు యం ఆంజనేయులు, కళ్ళం వెంకటేశ్వ రరా వు, అనుమోలు వెంకటేశ్వరరావు, మిరప నాగేశ్వరరావు, సాంబశివరావు, టీడీపీ నాయకులు దొంతు చిన్న బూసే నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

పూరిళ్లు దగ్ధం- 5 లక్షల ఆస్తి నష్టం

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యుత్ షార్ట్ సర్కిట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గృహాలు పూర్తిగా కాలిపోగా 5 లక్షల రూపాయలు నష్టం వాటిలినట్లు స్టేషన్ ఫైర్ అధికారి పి.ఎస్.వి.వి ప్రసాద్ మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి అవనిగడ్డ సివారు వసుమట్ల కాలనీలో విద్యుత్ షార్ట్ సర్కిట్ కారణంగా రెండు పూరిళ్ళు అగ్నికి ఆహుతి అయ్యాయని ఇరు కుటుంబాల సభ్యులు కట్టుబట్టలతో మిగిలారని, అయితే చుట్ట పక్కలకు మంటలు ఎగబాకకుండా అదుపు చేశామని తెలిపారు.

ఇన్‌స్పైయిర్ మానక్ అవార్డుకు విద్యార్థి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- 2023-24 విద్యాసంవత్సరానికి ప్రభుత్వం ప్రకటించిన ఇన్ - స్పైర్ మానక్ అవార్డుకు స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ విద్యార్థి కాగిత ప్రభు విశాల్ (8) ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ తెలిపారు. ఈ విద్యార్థి సృజనాత్మకమైన ప్రాజెక్టును తయారుచేసి ఇన్ - స్పైర్ మానక్ ఎగ్జిబిషన్ నందు ప్రదర్శించేందుకు విద్యార్థి బ్యాంకు ఖాతాలో రూ.10 వేలను ప్రభుత్వం జమచేస్తుందన్నారు. విద్యార్థి కాగిత ప్రభు విశాల్‌ను పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ ,పాఠశాల కరస్పాండెంట్ కె ఎస్ వి జి శోభ ,ఉపాధ్యాయిని , విద్యార్థిని ,విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నూకసానిని కలిసిన గరికపాటి

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు గరికిపాటి వెంకట్ మంగళవారం ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నూకసాని బాలాజీ మర్యాద పూర్వకంగా కలిసి, శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి, దర్శి నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ ఎన్నికలకు ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే దాని గురించి చర్చించడం జరిగింది. అనంతరం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు.

మల్లికార్జునని పరామర్శించిన గరికపాటి : దర్శి మండలంలోని తూర్పు వీరాయపాలెం గ్రామ టీడీపీ ప్రెసిడెంట్ మందాడి మల్లికార్జునరావు ఒంగోలులోని ఉపాస హాస్పిటల్లో అనారోగ్యంతో ఉండగా, వారిని పలకరించి మనో ధైర్యాన్ని నింపి, అధైర్య పడవద్దు అన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే కోన

విశాలాంధ్ర – కర్లపాలెం : మండలంలోని గణపవరంకు చెందిన మాజీ సర్పంచ్ కత్తి డానియల్ కుమారుడు కత్తి వరప్రసాద్ వివాహ వేడుకలో ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు సర్పంచులు,వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యంలో ఎంపిఏ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠంలో ఈనెల 20వ తారీకు వరకు జరిగే థియరీ, ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఎం పి ఏ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పూట నిర్వహించినమొదటి సంవత్సరంలో 18 మంది,, మధ్యాహ్నం నుంచి నిర్వహించిన రెండవ సంవత్సరంలో పదిమందికి పైగా హాజరైన ఈ పరీక్షలకు అధికారులుగా నాట్యాచార్యఏలేశ్వరపుపూర్ణచంద్ర రావు(ఉదయం), నాట్యాచార్య ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు(మధ్యాహ్నం) కొనసాగారు. ఈ విద్యార్థులకు నట్వాంగాన్ని కళాపీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు నిర్వహించగా గాత్రంపై డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని, మృదంగంపై పసుమర్తి హరినాథ శాస్త్రి సహకరించారు. ఈ పరీక్షలకుకళా పీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి చీఫ్ సూపరింటెండెంట్ గా వ్యవహరించారు.

రక్తదానంను కొనసాగించాలి - వీసీ జ్ఞానమణి

విశాలాంధ్ర బ్యూరో-మచిలీ పట్నం: కృష్ణా విశ్వవిద్యాలయం: రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడిన వారుగా వుంటారని, అందువల్ల దానిని ఒక వ్యసనంగా అలవాటు చేసుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పిలుపు నిచ్చారు. మంగళవారం కృష్ణా విశ్వవిద్యాలయ ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్, రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యం లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ కృష్ణా విశ్వ విద్యాలయం లో నిరంతరం రక్త దాన కార్యక్రమాలు నిర్వహించటం చాలా గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏ ఇతర విశ్వవిద్యాలయ లో ఇలాంటి సేవా కార్యక్రమాలు తాను చూడలేదన్నారు. ఈ శిబిరంలో 40 యూ నిట్ల రక్తం ను సేకరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మ చారి, రెడ్ క్రాస్ కార్యదర్శి శంకర్ నాథ్, కోశాధికారి బాలాజీ, అసోసియేట్ ఎన్ సి సి అధికారి డా రామశేకర్ రెడ్డి, రెడ్ క్రాస్ వైద్యులు డా హాను మంతయ్య, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

కొడాలిలో పోలింగ్ బూత్ పరిశీలన

విశాలాంధ్ర-ఘంటసాల: మండల పరిధిలోని కొడాలి లోని పోలింగ్ కేంద్రాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. ప్రజలు ఓట్లు వేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని క్రింది స్థాయి అధికారులకు సూచించారు. ఘంటసాల మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శేష మాంబ, జడ్పిటిసి సభ్యులు తుమ్మల మురళీకృష్ణ, సీఐ నాగప్రసాద్, మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస చందు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన కానిస్టేబుల్ నాగరాజు

- అభినందించిన ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 5వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ లో రాష్ట్రం తరపున 40 ప్లస్ విభాగంలో పోల్ వాల్ట్, షార్ట్ పుట్‌లలో జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ నాగరాజు అత్యుత్తమ ప్రతిభ కనపరచి పతకాలు సాధించాడు. పోల్ వాల్ట్‌లో స్వర్ణ పతకం,షార్ట్ పుట్‌లో రజత పతకం సాధించి ఉత్తమ ప్రతిభతో ఆకట్టుకున్న నాగరాజు మే నెలలో ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపిక అయ్యాడు.జాతీయస్థాయిలో జిల్లా పోలీస్ ఖ్యాతిని ఇనుమడింపజేసి అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన నాగరాజును మంగళవారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించి మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయస్థాయిలో 24 రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొన్న రాష్ట్రం తరపున పాల్గొన్న హెడ్ కానిస్టేబుల్ సిహెచ్.నాగరాజు పోల్ వాల్ట్‌లో స్వర్ణ,షార్ట్ పుట్‌లలో రజత పతకాలు సాధించి జిల్లా పోలీస్ శాఖకు పేరు తీసుకురావటం అభినందనీయం అన్నారు. మేనెలలో ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో కూడా పాల్గొని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.నాగరాజును స్ఫూర్తిగా తీసుకొని జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్రీడలలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.మల్లికార్జున రావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే గెలుస్తా..

- గుద్దంటి చంద్రమౌళి

విశాలాంధ్ర - చీరాల : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చీరాల అసెంబ్లీ అభ్యర్థిగా అవకాశం ఇస్తే భారీ మెజారిటీతో గెలిపిస్తానని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మాజీ జెడ్పిటిసి గుద్దంటి చంద్రమౌళి అన్నారు.మంగళవారం గోలి సదాశివ కళ్యాణమండపంలో టీడీపీ నాయకులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గుద్దంటి చంద్రమౌళి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి పార్టీ కోసం పని చేస్తున్నానని అత్యధికంగా బీసీలున్న చీరాలలో అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని భారీ మెజారిటీతో గెలుస్తానన్నారు.టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజారాపు అచ్చెన్నాయుడు పిలుపు మేరకు చీరాల టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేశానని,పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పిస్తే చీరాలలో పోటీ చేసి గెలిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని జనాభా ప్రాతిపదికన బీసీలు ఎక్కువగా ఉండడంతో పార్టీలో సీనియర్ నైనా నన్ను చీరాలలో పోటీ చెయ్యాలని అచ్చెన్నాయుడు పిలిచారన్నారు.ఈ కార్యక్రమంలో పోతుల వెంకటేశ్వర్లు,అందే ఉమామహేశ్వరరావు,కర్ణ శ్రీనివా సరావు,సయ్యద్ ముంతారహర్,సూరగాని బాలశంకర్,అవ్వారు సాంబయ్య, పఠాన్ గౌస్,వంశీ కృష్ణ,గుత్తికొండ కిషోర్,మహిళా నాయకులు నందం లావణ్య,కర్పూరపు,నాగదుర్గ, తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

ఏపీఐఐసి చైర్మన్‌గా జంకె వెంకటరెడ్డి నియామకం

విశాలాంధ్ర-మార్కాపురం : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపిఐఐసి) చైర్మన్‌గా జంకె వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నేడు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన వైసీపీపార్టీకి జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. అలాగే 1994లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా, 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి తరుపున పోటీ చేసి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేగా వున్న ఈయనకు ఆ ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదు. 2019 ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి వైసిపి ఎమ్మెల్యే టిక్కెట్ కెపి నాగార్జునరెడ్డికి ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ సారి 2024 ఎన్నికల్లో నైనా ఎమ్మెల్యే టిక్కెట్ తనకే దక్కుతుందని జంకె భావించారు. అయితే అనూహ్యంగా టిక్కెట్ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు రావడంతో జంకె అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. దీంతో ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేక పోయిన వైసిపి అధిష్ఠానం జంకె ను సంతృప్తి పరచేందుకు కీలకమైన కార్పొరేషన్ పదవి ఇచ్చినట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

రా..కదలిరా.. సభను విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - బల్లికురవ : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రా..కదలిరా.. కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీన పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు గ్రామంలో రగబోయే రా..కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మంగళవారంసంతమాగులూరులోని గొట్టిపాటి అతిథి గృహంలో బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు గ్రామ టీడీపీ నాయకులు గొట్టిపాటిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పీడిత వర్గాలను ఏకం చేసే లక్ష్యంతో వారి దుశ్చర్యలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళడానికి, వైసీపీ బాధిత వర్గాలు అన్నిటినీ ఏకంచేసి తెలుగు దేశం,జనసేనపార్టీలు అధికారంలోకి వస్తే ఎటువంటి న్యాయం జరుగుతుందో తెలిపేవిధంగా ఈ సభ నిర్వహిస్తున్నారన్నారు.రా కదలి రా బహిరంగ సభకు ఉమ్మడి ప్రకాశంజిల్లా నలు మూలల నుంచి ప్రజలందరూ తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డికి ఇదే చివరి ఛాన్స్ అనేలా శ్రేణులను సమాయత్తం కావాలన్నారు.రాష్ట్రంలో వైసీపీ నాలుగు సంవత్సరాల పదినెలలు పాలనలో అన్ని వర్గాలు ప్రజలు బాధితులేనని,జగన్మోహనరెడ్డి పాదయాత్ర లో రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి,అధికారం చేపట్టిన తర్వాత పెరిగిన ధరలతో వైసీపీ వేస్తున్న పనులతో రాష్ట్రంలో పేద బలహీన వర్గాల ప్రజ లందరూ ఇబ్బందులు పడుతున్నారని.అటువంటి భాధితుల ప్రయోజనాలు కాపాడే విధంగా చంద్రబాబునాయుడు,పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్రంలో వైసీపీ రహిత పాలన తీసుకుని రావాలనే లక్ష్యంతో సంయుక్తంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. టీడీపీ జనసేన పార్టీ శ్రేణులంతా తరలి వచ్చి చంద్రబాబు సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు

విశాలాంధ్ర - నిజాంపట్నం : నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు అని వాటి సంరక్షణ పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని కూచినపూడి పశు వైద్యశాల అవరణలో నిర్వహించిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అయన హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో నాలుగు లేగ దూడల రైతులకు బహుమతులు అందజేయగా కార్యక్రమంలో పాల్గొన్న మిగిలిన లేగ దూడల రైతులకు ప్రశంసా పత్రాలు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎద ఇంజక్షన్ ద్వారా పుట్టే దూడలలో 50 శాతం మగ దూడలు, 50 శాతం ఆడ దూడలు ఉంటున్నాయన్నారు. దీంతో పశువుల జాతి సంతతి అభివృద్ధి చెందడం లేదనే ఉద్దేశంతో కేవలం ఆడ దూడలే పుట్టే విధంగా వీర్యకణాలను వేరుపరిచి ఆడ దూడలు పుట్టే విధంగా ఎద ఇంజక్షన్లను అతి తక్కువ ధరకే సబ్సిడీపై చేయడం జరుగుతుందన్నారు.పాడి రైతులకు సంపూర్ణ మిశ్రమ దాణాను 60 శాతం సబ్సిడీపై ఇస్తున్నామని తెలిపారు.ఈ సంవత్సరంలో ఇప్పటికే 300 మెట్రిక్ టన్నుల దాణాను అందించడం జరిగిందన్నారు.పశుగ్రాస విత్తనాలను ప్రభుత్వం పాడి రైతులకు 75 శాతం సబ్సిడీపై అందిస్తుందన్నారు.ఇప్పటికే 180 మెట్రిక్ టన్నుల పశుగ్రాస విత్తనాలను రైతులకు అందించడం జరిగిందని చెప్పారు.పశుగ్రాస చాప్ కట్టర్లను 40 శాతం సబ్సిడీపై రైతులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు.గాలికుంటు వ్యాధి పశువుల్లో సోకడం వల్ల పశువు మేత, నీరు తీసు కోలేనందున పశువు నిరసించిపోతుంద న్నారు. ఈ గాలికుంటు వ్యాధి నివారణకు ప్రతి 6 నెలల ఒకసారి పశువులకు సమీప పశువైద్యశాలలో ఉచితంగా టీకా వేస్తారని చెప్పారు.ఈ టీకా వల్ల పశువులకు ఎలాంటి హానీ ఉండదని తెలిపారు.ప్రతి ఒక్క పాడి రైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ తెనాలి డిడి వై.కేదారేశ్వర రావు, ఏడీలు డాక్టర్ నరేంద్రబాబు, డాక్టర్ నాగేశ్వరరావు, కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ హేమ ప్రియా, పశు వైద్యులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మీనాక్షి దేవి, డాక్టర్ రంజిత, డాక్టర్ రోషన్ బేగ్, సర్పంచ్ రాజేశ్వరి రామారావు, పాడి రైతులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో శివ దంపతులు పూజలు

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణంలోని షిరిడి సాయిబాబా దేవాలయం 28 ప్రతిష్ట వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం ప్రముఖ వ్యాపారవేత్త గుంద్రెడ్డి శివ అనురాధ దంపతులచే అఖండ దీప స్థాపన,అఖండ నామ సప్తాహం ప్రారంభించారు. నియోజకవర్గ ప్రజలు సు:ఖ శాంతులతో పాడి పంటలతో వర్ధిల్లాలని పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల షిరిడి సాయి బాబా సేవా సమితి సభ్యులు అధ్యక్షులు కె.రాజ్య లక్ష్మి, సెక్రటరీ ఉప్పాల వీరయ్య,బలగాని బాల కృష్ణుడు,ఉడ గోవిందరావు పాల్గొన్నారు.

నేడు జగనన్నకి చెబుదాం

విశాలాంధ్ర - బల్లికురవ : బుధవారం బల్లికురవ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టర్ రంజిత్ భాష అధ్యక్షతన జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనుమ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు వారి యొక్క సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చున్నారు.ఈ కార్యక్రమాన్ని మండల ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

శివరాత్రి మహోత్సవం ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర-త్రిపురాంతకం : మార్చి నెలలో జరగనున్న మహా శివరాత్రి మహోత్సవ ఏర్పాట్లపై రెవెన్యూ శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మొదటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో మంగళవారం జరిగింది. ముందుగా ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు వారు నిర్వహించే పనులు గురించి వివరించారు.అనంతరం ఆలయ నిర్వాహణ అధికారి చెన్నకేశవ రెడ్డి నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులను సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా పాలకమండలి చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ శక్తి వంచన లేకుండా ఆలయ అభివృద్ధికి పాలక మండలి సభ్యులు అందరూ సహకరిస్తామని అన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ భ్రమరాంబ మాట్లాడుతూ ప్రతి ఒకరు శివరాత్రి ఏర్పాట్లు విజయవంతం కావడానికి కృషి చేయాలన్నారు.వారికి కేటాయించిన పనులను తప్పక నిర్వర్తించి ఆలయానికి మండలానికి మంచి పేరు తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, నాయకులు, అన్నదాన సత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.